సాక్షి అనంతపురం

శుక్రవారం । 17 । మే । 2024



టన్ను చీనీ రూ.36,500

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,500 పలికాయి.



రాచరిక దర్పం.. టిప్పు కట్టడం

టిప్పు సుల్తాన్ రాజరిక దర్పానికి అద్దం పట్టే భవంతులు నేటికీ చెక్కు చెదరకుండా పర్యాటలకును విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

8లో

గరిష్టం/కనిష్టం
39.3°/22.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత తగ్గింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో వడగాల్పులు వీచాయి.

ఉజ్వల భవితకు ఐటీఐ

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సు పూర్తి కాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- స్వల్పకాలిక వ్యవధిలోనే స్థిరపడుతున్న విద్యార్థులు
- అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల



అనంతపురంలోని ఐటీఐ కళాశాలలో మోటారు మెకానిక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జిల్లాలో ఐటీఐలు	24
ప్రభుత్వం	5
ప్రైవేట్	19
మొత్తం ఖాళీలు	3,336
ప్రభుత్వ ఐటీఐల్లో ఖాళీలు	1,060
ప్రైవేట్ ఐటీఐల్లో ఖాళీలు	2,276

దరఖాస్తుల ఆహ్వానం..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు తొలివిడత కౌన్సెలింగ్‌కు అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అనంతపురం ఎడ్యుకేషన్: యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి ఐటీఐలు. కావాల్సినంత భరోసానిస్తూ బంగారు భవితకు బాటలు పరుస్తున్నాయి. ఐటీఐలలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెళుకువలపై పట్టు సాధిస్తుండడంతో కోర్సు పూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వల్పకాలిక వ్యవధిలోనే జీవితాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు.

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు..

జిల్లాలోని పలు ఐటీఐలు సంప్రదాయ కోర్సులతో పాటు ఒక్కో కోర్సుకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నాయి. అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో టర్నర్, మెషినిస్ట్, ఫిట్టర్, మెషినిస్ట్ గ్రైండర్ కోర్సులు చేసిన పలువురు విద్యార్థులు ప్రముఖ సంస్థలైన బీహెచ్ఈఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్, బీఈఎల్, ఐటీసీఎల్, ఎన్‌టీపీసీ, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగాలు పొందారు.

కోర్సు మధ్యలోనే ఆన్ జాబ్ ట్రైనింగ్

విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు చదువుతుండగానే మధ్యలో ఓజేటీకి పంపుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లోని వివిధ సంస్థల్లో మూడు నెలలు, ఆరు నెలల వ్యవధితో సంబంధిత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయా సంస్థలు స్టయిఫండ్‌గా కొంత మొత్తం చెల్లిస్తుండడం గమనార్హం. కోర్సు పూర్తయిన తర్వాత అవే సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడాలనే సంకల్పంతో ఈ పద్ధతిని తీసుకొచ్చినట్లు తెలిసింది. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 246 మంది విద్యార్థులు ఓజేటీకి వెళ్లారు.

కోర్సులివే...

కోపా (ఏడాది కోర్సు), డి/మాన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్ (రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్ (రెండేళ్లు), ఫిట్టర్ (రెండేళ్లు), మెచినిస్ట్ గ్రైండర్ (రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (రెండేళ్లు), మెకానిక్ డీజిల్ (ఏడాది), టర్నర్ (రెండేళ్లు), వైర్‌మెన్ (రెండేళ్లు), వెల్డర్ (ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్ (రెండేళ్లు), డ్రెస్ మేకింగ్ (ఏడాది), ప్లంబర్ (ఏడాది), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ (రెండేళ్లు), ఐసీటీఎస్ఎం (రెండేళ్లు), మెషినిస్ట్ (రెండేళ్లు).

మెళకువలు నేర్చుకున్నా



టర్నర్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నా. దొడ్డబళ్లాపూర్‌లోని ఇండో ఎంఐఎం కంపెనీకి ఓజేటీకి వెళ్లా. సీఎన్‌సీ మీద పని చేయడం నేర్చుకున్నా. కంపెనీలోనూ మెళుకువలు బాగా నేర్పించారు. నెలకు రూ. 9 వేలు స్టయిఫండ్ ఇచ్చారు.

– సాయిపందు విద్యార్థి, ప్రభుత్వ బాలుర ఐటీఐ, అనంతపురం

రూ. 10 వేల స్టయిఫండ్ ఇచ్చారు



నేను ఎలక్ట్రీషియన్ ట్రేడ్ రెండో సంవత్సరం చదువుతున్నా. చెన్నైలోని సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్ కంపెనీకి ఓజేటీకి వెళ్లా. కర్మాగారంలో స్పేర్‌పార్ట్స్ తయారు చేయడం నేర్చుకున్నా. నెలకు రూ. 10 వేలు స్టయిఫండ్ ఇచ్చారు.

– ఎం.గంగాధర్, ప్రభుత్వ బాలుర ఐటీఐ, అనంతపురం

బాగా నేర్పిస్తున్నారు



పీఎంకేవీవై కింద మూడు నెలల కోర్సులో చేరా. డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నా. చాలా బాగా నేర్పిస్తున్నారు. ఈ మెళుకువలు చాలా ఉపయోగపడతాయని ఆశిస్తున్నా.

– ఎ. వినీత, అనంతపురం

ఉజ్వల భవిత అందించాలనే సంకల్పం



ఐటీఐలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిత అందించాలన్నదే మా ప్రధాన సంకల్పం. ట్రేడ్‌ల పాఠాలతో పాటు భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. చాలామంది మా విద్యార్థులు పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం సంతోషకరం.

– ఎ.రామమూర్తి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలుర ఐటీఐ, అనంతపురం

న్యూస్‌రీల్

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి



జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టర్ గురువారం జేఎన్‌టీయూను సందర్శించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనుక్షణం సీసీ కెమెరాల నిఘా ఉండాలన్నారు. కౌంటింగ్ వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

- తొలి రోజు 2,745 మంది హాజరు



అనంతపురం: జిల్లావ్యాప్తంగా గురువారం ఏపీ ఈఏపీ సెట్ ప్రశాంతంగా సాగింది. రెండు సెషన్లలో 2,745 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 23 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్ష జరగనుంది. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుంది. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

8 మంది అరెస్టు

పెద్దవడుగూరు: తాడిపత్రి పట్టణంలో జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురు, టీడీపీకి చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని హితవు పలికారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ



మాట్లాడుతున్న మలేరియా అధికారి ఓబులు

గుత్తి: ప్రజల భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని జిల్లా మలేరియా అధికారి ఓబులు పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. డెంగీ వ్యాధి, నివారణపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, శానిటేషన్ సెక్రటరీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య, వైద్యులు, గిరిధర్‌రెడ్డి, వినయ్ కుమార్, నెట్టి కల్లు తదితరులు పాల్గొన్నారు.

క్వింటా చింతపండు రూ.16 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.16 వేలు ధర పలికింది. మార్కెట్‌కు గురువారం 1,200 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.11 వేల ప్రకారం ధర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.8,500, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. బోటు రకం చింత క్వింటా గరిష్టంగా రూ.3 వేలు, కనిష్టంగా రూ.2,500 ప్రకారం పలికింది.

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నాబార్డు డీడీఎం అనురాధ

అనంతపురం అగ్రికల్చర్: పేద మహిళల స్వయం ఉపాధి, జీవనోపాధుల లక్ష్యంగా జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) వివిధ కార్యక్రమాలు చేపడుతోందని ఆ బ్యాంకు జిల్లా అధికారి (డీడీఎం) అనురాధ తెలిపారు. నాబార్డు ఆర్థిక సహకారంతో 'కార్డు' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చంద్రబాబు కొట్టాలలో 30 మంది డ్వాక్రా మహిళలకు పట్టుదారాలతో ఆభరణాల తయారీపై 15 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం చంద్రబాబుకొట్టాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి డీడీఎం ముఖ్య అతిథిగా హాజరై సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణలో వారు తయారు చేసిన వివిధ రకాల ఆభరణాలను తిలకించారు. ఇలాంటి స్వయం ఉపాధి కార్యక్రమాలతో ప్రతి మహిళ పేదరికాన్ని జయించి మెరుగైన జీవన ప్రమాణాలు పొందగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో 'రూడ్‌సెట్' డైరెక్టర్ విజయలక్ష్మి, ఏడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మంజుల, మేఘన ఎన్జీవో పీడీ సుశీల, ట్రైనర్ తన్మయి, కార్డు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జోనల్ వ్యాప్తంగా దాదాపు 28 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా స్లీపర్, 3 ఏసీ కోచ్‌లను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా గుత్తి జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న నర్సాపూర్–ధర్మవరం (17247/48) ఎక్స్‌ప్రెస్ రైళ్లు, అదేవిధంగా గుంతకల్లు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న నర్సాపూర్–హుబ్లీ (17225/26) అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 21 వరకూ అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ

- ఉమ్మడి జిల్లాకు రానున్న 1.74 లక్షల క్వింటాళ్లు
- కే–6, టీసీజీఎస్–1694, కే–1812 రకాల కేటాయింపు



విత్తన వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో పంట సాగుకు వీలుగా రైతులకు పంపిణీ చేయనున్న విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ ప్రకటిస్తూ వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విత్తన సేకరణ, ప్రాసెసింగ్, సరఫరాకు నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్)ను గుర్తించింది. ఈ సారి కే–6 రకంతో పాటు కొత్తగా టీసీజీఎస్–1694, అలాగే కదిరి–లేపాక్షి (కే–1812) విత్తన రకాలను కూడా పంపిణీ చేయాలని నిర్ణయించారు. కొన్ని ప్రాంతాల్లో నారాయణి రకాన్ని కూడా ప్రోత్సహించాలని సూచించారు. కే–6, టీసీజీఎస్–1694 రకాలు క్వింటా పూర్తి ధర రూ.9,500 కాగా అందులో 40 శాతం రూ.3,800 సబ్సిడీ పోను రైతులు తమ వాటా కింద రూ.5,700 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. అలాగే నారాయణి రకం క్వింటా పూర్తి ధర రూ.9,700 కాగా, అందులో 40 శాతం రూ.3,880 పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,820 ప్రకారం చెల్లించాలి. ఇక కదిరి–లేపాక్షి 1812 రకం పూర్తి ధర క్వింటా రూ.8,700 కాగా 40 శాతం రాయితీ రూ.3,480 పోను రైతులు తమ వాటా కింద రూ.5,220 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని నిర్ధారించారు. ఒక్కో రైతుకు భూ విస్తీర్ణం బట్టి గరిష్టంగా 90 కిలోలు (30 కిలోలు కలిగినవి మూడు బస్తాలు) పంపిణీ చేయనున్నారు. గిరిజన ప్రాంతాలు కలిగిన జిల్లాల్లో విత్తన వేరుశనగపై రైతులకు 90 శాతం రాయితీ వర్తింపజేశారు.

త్వరలో రిజిస్ట్రేషన్లు..

ఆర్‌బీకే వేదికగా విత్తన పంపిణీ చేస్తుండగా ఒకట్రెండు రోజుల్లోనే రైతుల నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రత్యేక‌యాప్‌ను అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు చెబుతున్నారు. విత్తన పంపిణీలో ఎస్సీ ఎస్టీ, కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆర్‌బీకే అసిస్టెంట్లు వెంటనే తమ పరిధిలో విత్తన అవసరాలు, రైతుల రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలని నిర్దేశించారు. కాగా ఈ ఖరీఫ్‌లో జిల్లాకు 76 వేల క్వింటాళ్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు 98 వేల క్వింటాళ్లు.. మొత్తం 1.74 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయింపులు చేశారు. రెండు మూడు రోజుల్లోనే జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు కేటాయింపులు, ధరలు, సబ్సిడీ వివరాలు, అలాగే కందులు, ఇతర చిరుధాన్యాల విత్తనాల పంపిణీ వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. విత్తన పంపిణీకి సంబంధించి గ్రామ స్థాయి నుంచి మండల, డివిజన్, జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యల గురించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) రూపంలో మార్గదర్శకాలు విడుదల చేశారు.

విత్తు కోసం రంగంలోకి వ్యవసాయ శాఖ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: విత్తన వేరుశనగ పంపిణీ సన్నాహక చర్యలను వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. 'విత్తుపై దృష్టి సారించని వ్యవసాయ శాఖ' శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయశాఖ వెంటనే స్పందించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణం రంగంలోకి దిగారు. అలాగే ఎన్నికల కమిషనర్, వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి కూడా విత్తన పంపిణీ మార్గదర్శకాలు, కేటాయింపులు, ధరలు, సబ్సిడీ వివరాలు కూడా వెల్లడి కావడంతో విత్తన సేకరణ, విత్తన శుద్ధిపై దృష్టి సారించారు. డీఏఓ ఆదేశాల మేరకు అనంతపురం ఏడీఏ ఎం.రవి, ఏఓ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు స్థానికంగా ఉన్న ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించి అక్కడ జరుగుతున్న విత్తనశుద్ధిని పరిశీలించారు. తేమశాతం, ఫిజికల్ ప్యూరిటీ తదితర నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులకు నాణ్యమైన విత్తనం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులను ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల అక్రమ అరెస్టులు ఆపాలి

- తాడిపత్రిలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ కార్యకర్తల అక్రమ అరెస్టులు ఆపాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడిపత్రిలో టీడీపీ నేతల దౌర్జన్యానికి అడ్డుకట్ట వేసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డికి ఓట్లు అధికంగా పడతాయని గ్రహించే తాడిపత్రివాసులను టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తన అనుచర గణంతో కలిసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. వీరిని అడ్డుకోవడానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళితే ఆయన కారుపై రాళ్లు రువ్వారని, దీన్ని ఆధారంగా తీసుకుని పోలీసులు ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. దీంతో వేలాది మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు గ్రామాలు విడిచి వెళ్లాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు జేసీ కుటుంబానికి మద్దతుగా నిలవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఈ విషయాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్‌కే సుధీంద్ర మాట్లాడుతూ టీడీపీ మనుగడకు ఈ ఎన్నికలు రెఫరండమ్‌లాంటివన్నారు. ఓటమి భయంతోనే ఆ పార్టీ నాయకులు భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమైందన్నారు. తాడిపత్రిలో పోలీసుల ఏకపక్ష వ్యవహార శైలి చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా, అనాగరిక దేశంలో ఉన్నామా అన్న సందేహం కల్గుతోందన్నారు. ఈ ఘటనలపై లోతుగా విచారణ చేసి, బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఎలెక్షన్ కమిషన్‌ను డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని నాగన్న, తాడిపత్రి ఇన్‌చార్జ్ సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎంత పని 'జేస్తి'వయ్యా!

- అరెస్టు భయంతో ఆస్పత్రిలో చేరిన జేసీ ప్రభాకర్ రెడ్డి
- ఆయన్ను నమ్ముకుని రెచ్చిపోయిన అనుచరులు అజ్ఞాతంలోకి
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న వైనం



పెద్దపప్పూరు: ఎన్నికల ముందు వరకు వచ్చేది తమ ప్రభుత్వమే అంటూ రెచ్చిపోయిన జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెరగడం, మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలుస్తుందని తేలిపోవడంతో గ్రామాల్లో హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, పెద్దపప్పూరు, చిన్నపప్పూరు తదితర గ్రామాల్లో పచ్చ మూకలు చేసిన రగడ అంతా ఇంతా కాదు. అంతటితో ఆగకుండా ఈ నెల 14న తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై రాళ్లు, టపాసులతో వీరంతా దాడి చేశారు. ఈ అరాచక కాండకు ప్రధాన సూత్రధారి అయిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి.. పోలీసులు తనను ఎక్కడ అరెస్టు చేస్తారోనన్న భయంతో అనారోగ్యం నాటకమాడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. దాడులకు తమను ఉసిగొల్పిన వ్యక్తి ఒక్కసారిగా మాయమవడంతో మండలంలోని ఆ పార్టీ గూండాలు నేడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి కొండలు, గుట్టలు, పొలాల బాట పట్టి తమ బంధువుల ద్వారా అన్న పానీయాలను తెప్పించుకుంటూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై దాడి ఘటనలో మండలంలోని ఏఏ గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయులు పాలుపంచుకున్నారనే విషయాన్ని ఇప్పటికే గుర్తించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఎస్పీ అమిత్ బర్దర్ సస్పెన్షన్

- తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, అర్బన్ సీఐ మురళీకృష్ణపైనా వేటు
- పట్టణంలో హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం



ఎస్పీ అమిత్ బర్దర్ డీఎస్పీ సీఎం గంగయ్య, సీఐ మురళీకృష్ణ

అనంతపురం/తాడిపత్రి: ఎన్నికల సందర్భంగా జిల్లాలో చెలరేగిన అల్లర్లపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తీవ్రంగా స్పందించింది. ఎస్పీ అమిత్‌బర్దర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో పాటు ఆయనపై శాఖాపరమైన విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఎస్పీతో పాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, అర్బన్ సీఐ మురళీకృష్ణను కూడా ఈసీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తాడిపత్రి పట్టణంలో పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు జరిగిన ఘర్షణలను అదుపు చేయడంలో వీరు విఫలమైనట్లు ఈసీ గుర్తించింది. ఘర్షణలను ముందే పసిగట్టి అరికట్టలేదనే నిర్ణయానికి వచ్చి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. అలాగే,తాడిపత్రి లో జరిగిన ఘటనలపై నమోదైన ప్రతి కేసుపై విచారించేందుకు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మొత్తం వ్యవహారంపై రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని పేర్కొంది.

సస్పెన్షన్ వేటు పడిన తొలి ఎస్పీ..

జిల్లా పోలీసు చరిత్రలో గతంలో ఎన్నడూ ఓ ఎస్పీ సస్పెండ్ కాలేదు. తొలిసారిగా అలా వేటు పడిన ఎస్పీ అమిత్ బర్దర్ కావడం గమనార్హం. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ అన్బురాజన్‌ను ఈసీ బదిలీ చేసింది. అనంతరం అమిత్ బర్దర్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. అనతి కాలంలోనే ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం.

ఫలితాల ప్రకటన తర్వాత భద్రత కల్పించండి

కాగా, ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత జిల్లా వ్యాప్తంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఈసీ దిశానిర్దేశం చేసింది. జూన్ 4న కౌంటింగ్ తరువాత తాడిపత్రిలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా నియంత్రించడానికి కేంద్ర బలగాల కంపెనీలను అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ బలగాలు హోం మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండేలా చూసుకోవాలని సూచించింది.

టీడీపీ నాయకుల వల్లే బలి..

ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన తనయుడు జేసీ అస్మిత్ రెడ్డి తాడిపత్రిలో కవ్వింపు చర్యలకు దిగారు. పచ్చ మూకలతో కలిసి ప్రశాంత పట్టణంలో హింస రాజేశారు. ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపైనే దాడికి యత్నించారు. ఈ క్రమంలోనే ఎస్పీ సస్పెండ్‌కు గురి కావడం గమనార్హం. గత నెల 5న ఎస్పీగా అమిత్ బర్దర్ బాధ్యతలు తీసుకున్నారు. టీడీపీ నాయకుల హింసాత్మక వైఖరి కారణంగా కేవలం 40 రోజుల్లోనే ఆయనపై సస్పెన్షన్ వేటు పడినట్లయింది.

అడిషనల్ ఎస్పీ రామకృష్ణపై చర్యలేవీ..?

కాగా, తాడిపత్రిలో హింసాత్మక ఘటనలకు పరోక్షంగా అడిషనల్ ఎస్పీ రామకృష్ణ కారణమయ్యారని ఏకంగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. ఆయన మద్దతుతోనే పచ్చ మూకలు రెచ్చిపోయారని కూడా విమర్శించారు. ఎన్నికల సంఘానికి ఆధార సహితంగా లేఖ కూడా రాశారు. అలాంటి ఏఎస్పీ రామకృష్ణపై మాత్రం ఈసీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: మండలంలోని కొటిపి గ్రామ సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

అగ్ని ప్రమాదంలో రూ.20 కోట్ల ఆస్తి నష్టం

సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న కియా అనుబంధ ఎస్ఎల్ఏపీ పరిశ్రమంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో రూ.20 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గురువారం కంపెనీ ముఖ్య ప్రతినిధులు ఎస్ఎల్ఏపీ పరిశ్రమకు చేరుకుని పరిశీలించారు. కియా కార్లకు సంబంధించిన హెడ్ లైట్లు, గ్లాసులు ఈ పరిశ్రమలో తయారవుతాయి. వెల్డింగ్ పనులు చేస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు ఎగిసిపడి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఘటనలో విలువైన యంత్రాలు కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ. 20 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు. కాగా, పరిశ్రమను ఆగమేఘాలపై పునరుద్ధరించి గురువారం నుంచి యథావిధిగా పనులు చేపట్టారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED MANAGERS
అనంతపురం నందు ప్రముఖ లైఫ్ Insurance Co. కొరకు MANAGERS కావలెను. M/F, Age: Upto 40 Yrs, Qul: Any Degree, Exp: 2 Yrs, Sal: 4L to 6L P/A+Incentives.
7306812727

WANTED
S.V.Degree & P.G College
Jesus Nagar, Ananthapuramu. Ph: 08554-234477, 9618469729
I) LECTURERS: Candidates must attend for interviews with all testimonials
Subjects: 1. Computer Science 2. Electronics 3. Bio-Technology
Eligibility: PG Degree with minimum 55%.
Preference will be given for Ph.D, SET/ NET Qualified & Experienced candidates.
II) NON- TEACHING STAFF: 1. Lady Warden (Full time), 2. Lab programmers for Computer Science 3. Attenders
Send your resumes to : careers@svdegreecollege.ac.in
Last date for submission of resumes: 25-05-2024 - Correspondent

కాయ్ రాజా కాయ్

- తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ గెలుపుపై రూ.కోట్లలో బెట్టింగ్
- ఐపీఎల్ తరహాలో మూడు అంశాలపై భారీగా నగదు వెచ్చిస్తున్న వైనం



తాడిపత్రి రూరల్: 'అనంత'లో బెట్టింగ్ రాయుళ్లకు పండగొచ్చింది. ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలివిగా సొమ్ము చేసుకుంటున్నారు. ఐపీఎల్ తరహాలో ఎన్నికల ఫలితాలు, మెజార్టీ, సీఎం ఎవరు అనే మూడో కోణాల్లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా తాడిపత్రిపైనే అందరూ దృష్టి సారించారు. పెరిగిన ఓటింగ్ శాతంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి విజయ అవకాశాలపై అంచనాలు పెరిగాయి. మహిళలు, మైనార్టీలు, వృద్ధులు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీంతో వైఎస్సార్‌సీపీ గెలుపుపై రూ.కోట్లలో బెట్టింగ్ కాస్తున్నారు.

ఎవరి సర్వేలు వారికి...

రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో పాటు తాడిపత్రిలో రెండో సారి ఆ పార్టీ అభ్యర్థి పెద్దారెడ్డి గెలుపు ఖాయమని ఇప్పటికే పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. దీనికి తోడు బెట్టింగ్ రాయుళ్లు సైతం వ్యక్తిగతంగా వారికి వారే అంచనాలు వేసుకుని పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాస్తున్నారు. చిన్నపాటి టీ స్టాళ్లలోనూ బెట్టింగ్‌లపైనే చర్చ సాగుతోంది. ఈ సారి ఐపీఎల్ తరహాలో మూడు కోణాల్లో బెట్టింగ్ కడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారు? మెజార్టీ ఎంత వస్తుంది? సీఎంగా ఎవరుంటారు? అనే మూడు అంశాలపై బెట్టింగ్‌లను ఆహ్వానిస్తున్నారు. ఎక్కువగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు టీడీపీ గెలుస్తుందని బెట్టింగ్ కడుతున్నారు. తొలుత రూ.లక్షల్లో మొదలైన బెట్టింగ్ ఈ రెండు రోజుల్లో రూ.కోట్లలోకి చేరుకుంది.

అల్లర్లతో పెరిగిన ఉత్కంఠ

ఎన్నికల పోలింగ్ రోజుల తాడిపత్రిలో జరిగిన అల్లర్లతో బెట్టింగ్‌రాయుళ్లలో ఉత్కంఠ నెలకొంది. దీంతో పోలింగ్ ముగిసిన మరుక్షణం నుంచే భారీగా బెట్టింగ్‌లు మొదలయ్యాయి. యుద్ధ వాతావరణాన్ని తలపించే రీతిలో అల్లర్లు జరగడంతో తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల గెలుపుపై ఎవరి అంచనాల మేరకు వారు పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాస్తున్నారు. ఈ క్రమంలోనే జూన్ 4న కౌంటింగ్ రోజు నాటికి బెట్టింగ్‌ల స్థాయి మరింత అవకాశముందని అంటున్నారు. రౌండ్ల వారీగా మెజార్టీపై బెట్టింగ్ కాసేందుకు పలువురు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

20 నుంచి 'దుర్గం'లో బ్రహ్మోత్సవాలు

- చకచకా సాగుతున్న ఏర్పాట్లు



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ గోపురం

రాయదుర్గం: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకూ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ నరసింహారెడ్డి గురువారం తెలిపారు. 20న కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 21 న సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ, 23న శేష వాహనం, 24న హనుమద్ వాహనం, 25న శ్రీవారి కల్యాణోత్సవం, 26న గజ వాహనం, 27న ఉదయం మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవం, 28న అశ్వవాహనం, 29న వసంతోత్సవం, 30న శయనోత్సవ కార్యక్రమాలు ఉంటాయి.

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దు



ఆయకట్టులో వరి కొయ్యలకు నిప్పు పెట్టిన దృశ్యం

రాయదుర్గం: ఖరీఫ్ సీజన్ ఆరంభంలో పంటలకు పొలాలను సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలు నాగలికి అడ్డు తగలకుండా రైతులు నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. అయితే ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. రాయదుర్గం డివిజన్‌లోని ఐదు మండలాల్లో హెచ్చెల్సీతో పాటు బీటీపీ ఆయకట్టు కింద రబీలో 2,130 హెక్టార్లలో వరి పంటలు కోతకొచ్చాయి. వరికొయ్యలకు నిప్పు పెట్టకుండా వాటిని నేలలో కలియదున్నడం వల్ల భూమి సారవంతమవుతుందని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ అంటున్నారు. దుక్కి దున్నే సమయంలో సూపర్‌ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలు అందుబాటులోకి వస్తాయంటున్నారు. ఫలితంగా డీఏపీ వాడకం తగ్గుతుందన్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి కొయ్యలను కలియదున్నితే దాదాపు టన్ను ఎరువు తయారవుతుందని సూచిస్తున్నారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు విపరీతమైన వేడి కారణంగా భూమి సారం కోల్పోతుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషకాల శాతం పెరుగుతుందన్నారు. వరి కోతలు కోసిన వారంతా కొయ్యలకు నిప్పుపెట్టడం మాని, కలియ దున్నాలని సూచించారు.

సార్వత్రిక ఎన్నికల్లో పక్కాగా కోడ్ అమలు

- రూ.6.11 కోట్ల నగదు స్వాధీనం
- రూ.27.23 లక్షల విలువైన మద్యం సీజ్



కంబదూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16వ తేదీ నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ- మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్)ని జిల్లా ఎన్నికల యంత్రాంగం పక్కాగా అమలు చేసింది. ప్రధానంగా క్షేత్రస్థాయిలో పర్యటించిన ఫ్లయ్యింగ్ స్క్వాడ్ బృందాలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీ కోసం నియమించిన స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, పోలీసు బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వర్తించి నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేశాయి. జిల్లాలో కోడ్ అమలు తీరును కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పనితీరునూ తనిఖీ చేస్తూ వచ్చారు. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యహరించారు.

నగదు, మద్యం సీజ్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఈ నెల 13న పోలింగ్ పూర్తయ్యే వరకూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు (ఎస్ఎస్‌టీ), పోలీసు బృందాలు చేపట్టిన తనఖీల్లో రూ.6,11,73,123 నగదు పట్టుబడింది. ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్) ద్వారా రూ.27,23,072 విలువ చేసే 11,346.9 లీటర్ల మద్యం సీజ్ అయింది.

159 ఉద్యోగుల సస్పెండ్

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై జిల్లా ఎన్నికల అధికారి కఠినంగా వ్యవహరించారు. షెడ్యూల్ విడుదలైన మార్చి 16వ తేదీ నుంచి పోలింగ్ జరిగిన 13వ తేదీ వరకు నియమావళి ఉల్లంఘించిన 159 మందిని సస్పెండ్ చేశారు. వలంటీర్లు 97 మంది, డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లు, గోపాలమిత్రలు 14 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 42 మంది, రెగ్యులర్ ఉద్యోగులు ఆరుగురు సస్పెన్షన్‌కు గురయ్యారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు వన్నూరుస్వామి

బ్రహ్మసముద్రం: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం ఎరడికెర గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (32) బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు... విషయాన్ని గమనించి వెంటనే వన్నూరుస్వామిని కాపాడి ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ పరుశురాముడు గురువారం ఉదయం ఎరడికెర గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

జగన్ మరోసారి సీఎం కావడం ఖాయం

- ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- గుంతకల్లు ఎమ్మెల్యే వైవీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

పామిడి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారని, అలాగే గుంతకల్లులో తన గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పామిడిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు, పెత్తందార్లకు మధ్యజరిగిన ఎన్నికల యుద్ధంలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమనే సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయన్నారు. ప్రజల ఆశీస్సులతో జగన్ మరోసారి తప్పక సీఎం అవుతారన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకీరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోయిజోడే కుమార్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, రాజశేఖరరావు, సునీల్‌కుమార్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

కళ్యాణదుర్గం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఇందరమ్మ కాలనీలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డెంగీపై వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇంట్లో ఎక్కువగా నీటిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలన్నారు. డెంగీ జ్వరాన్ని ముందుగానే పసిగడితే చికిత్స తేలిక అవుతుందన్నారు. ఈ విషయంపై ప్రజలను చైతన్య పరచాలని ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి సూచించారు. డెంగీ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రిహాజైనం, మాస్ మీడియా అధికారి ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ తిరుపాలయ్య, సూపర్‌వైజర్ కళావతి, ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి : డీపీఎంఓ



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎంఓ రవిశంకర్

యాడికి/పెద్దవడుగూరు: చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్ సూచించారు. యాడికి మండలం రాయలచెరువు పీహెచ్‌సీతో పాటు పెద్దవడుగూరు పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. అత్యవసర సమయాల్లో రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేపట్టాలన్నారు. యాడికిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దేవరాజన్, సిబ్బంది, పెద్దవడుగూరులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య వదిలి వెళ్లిందని వ్యక్తి బలవన్మరణం

రొద్దం: తనతో కాపురం చేయకుండా భార్య వదిలి వెళ్లడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం కంబాలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నరసింహమూర్తి(35)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం క్రితం మనస్పర్థలు చెలరేగడంతో భార్య వదిలేసి వెళ్లింది. దీంతో నరసింహమూర్తి మానసికంగా కుదేలయ్యాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని తాళలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రాచరిక దర్పం.. టిప్పు కట్టడం

చూసొద్దాం

అనంతపురం: సుల్తాన్ ఫతే అలీ సాహెబ్ టిప్పు... ఈ పేరు కంటే టిప్పు సుల్తాన్ అంటే అందరికీ సుపరిచయమే. ఆయన జెండాపైనే కాదు... తన ప్రవర్తనలోనూ పులి (టైగర్)ని మరిపించేలా మనుగడ సాగించిన టిప్పుసుల్తాన్ రాచరిక దర్పానికి నిదర్శనంగా నేటికీ ఆయన భవంతులు చెక్కుచెదరకుండా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వేసవి సెలవుల్లో కుటుంబసభ్యులతో కలసి ఏదేని చారిత్రక ప్రదేశాన్ని చుట్టి వద్దామనుకునేవారికి బెంగళూరులోని టిప్పు సుల్తాన్ వేసవి విడిది భవంతి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది.

అబ్బుర పరిచే 487 ఏళ్ల నాటి కట్టడం

మైసూరు పులిగా ఖ్యాతిగ్యాంచిన టిప్పు సుల్తాన్ 1537లో బెంగళూరులోని చామరాజపేటలో వేసవి విడిది భవంతిని నిర్మించారు. 487 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం నేటికీ చెక్కుచెదరలేదు. మొత్తం టేకుతో నిర్మితమైన ఈ భవంతిలో స్తంభాలు, ఆర్చీలు, బాల్కనీలు చూపరులను అబ్బుర పరుస్తుంటాయి. పై అంతస్తులో ఉన్న బాల్కనీలో టిప్పు సుల్తాన్ దర్బారు నిర్వహించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. ప్యాలెస్ మొదటి అంతస్తు మూలాల్లోని చిన్నచిన్న గదుల్లో అద్భుతమైన డిజైన్లు నేటి ఆర్కిటెక్చర్లను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. కింది అంతస్తులో ఉన్న గదులను మ్యూజియంగా మార్చారు. అక్కడ టిప్పు సుల్తాన్ వినియోగించిన కొన్ని వస్తువులు, దుస్తులు, శిరస్త్రాణం, వెండి, బంగారుపీఠాలు ప్రదర్శనకు ఉంచారు. ఉర్దూలో చెక్కిన పలు శాసనాలు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి.

సిటీ రైల్వే స్టేషన్‌కు 3 కి.మీ దూరంలో

టిప్పు వేసవి విడిది భవంతి సమీపంలోనే ఓ కోటను నిర్మించారు. ప్రస్తుతం బెంగళూరు కోటలో విక్టోరియా ఆస్పత్రి, కోటే వేంకటరమణస్వామి ఆలయం, మక్కళకూట పార్కు ఏర్పాటయ్యాయి. టిప్పు ఆయుధశాల ఉన్న ప్రాంతంలో బెంగళూరు మెడికల్ కళాశాల క్యాంపస్, పోర్టు హైస్కూల్, పోర్టు చర్చి, మింటో ఆప్తాల్మిక్ హాస్పిటల్, కిమ్స్ ఆస్పత్రి చేరాయి. ఈ ప్రాంతాలన్నీ బెంగళూరు సిటీ రైల్వేస్టేషన్‌కు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో నిత్యమూ పర్యాటకుల సందడి నెలకొని ఉంటుంది.



టిప్పు సుల్తాన్ తైలవర్ణ చిత్రం



భవనం ఎదుట ఏర్పాటు చేసిన పార్కు



టేకుతో నిర్మితమైన భవనం



భవనాన్ని పరిశీలిస్తున్న సందర్శకులు



టిప్పు సుల్తాన్ దర్బార్ నిర్వహించే బాల్కనీ



టేకు స్తంభాలు



పర్యాటకులతో సందడిగా ఉన్న వేసవి విడిది భవనం

రైలు కింద పడి వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: హిందూపురం-మలగూరు రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. బూడిద రంగు నైట్ ప్యాంట్, కుడి చేతికి కాషాయ రంగు దారం ఉంది. రైలు దూసుకెళ్లడంతో శరీరం ఛిద్రమైంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యాపారి....

పావగడ: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో నివాసముంటున్న మిఠాయి వ్యాపారి పార్శీలాల్ (30) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. రాజస్తాన్‌కు చెందిన ఆయన 13 సంవత్సరాలుగా పావగడలో నివాసముంటూ మిఠాయి వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం మిఠాయి బండిలోని బ్యాటరీని ఛార్జింగ్ పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరిపై కేసు నమోదు

గుత్తి రూరల్: మండలంలోని అనగానదొడ్డిలో ఘర్షణకు పాల్పడిన ఇద్దరిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామ శివారులో గొర్రెల మంద నిలిపే విషయంలో అదే గ్రామానికి చెందిన సురేంద్ర, ఓబుళరెడ్డి, విశ్వనాథ్ ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల మధ్య మాటమాటా పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. విశ్వనాథ్ కర్రతో దాడి చేయడంతో సురేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు విశ్వనాథ్, ఓబుళరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ANANTAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT - TENDER NOTICE

1	Tender Notice No.	01/2024-25/EE/TO, General Funds
2	Scope of Work	Supply and delivery of Vaporized liquid chlorine Gas Cylinders to Muddalapuramu filtration plant for the post chlorination of Water Supply in Ananthapuramu Municipal Corporation
3	Estimate Cost Ranging	Rs. 9.75 Lakhs

Note: The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner
Municipal Corporation, Anantapuramu

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

PHARMA / NURSING
■ B.ఫార్మసీ, B.Sc. (నర్సింగ్) కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజిలో హాస్టల్ కలదు. సంప్రదించండి : జి.మురళీ, 9030661651, అనంతపురము. [A-1999]

ADMISSIONS
■ R.R. క్రిస్టియన్ కాలేజి ఆఫ్ నర్సింగ్, కర్నూలులో B.Sc(N), P.B.B.S.C(N)/ GNM (స్టాఫ్ నర్స్) & MSRR కాలేజి ఆఫ్ ఫిజియోథెరపి, కర్నూలులో (ఫిజియోథెరపి డాక్టర్) కోర్స్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కొరకు సం.ప్ర: 94402 89937. [L-795705]

EDUCATION
■ విజయవాడలో B.P.T. (DOCTOR), B.Sc. MLT, DMLT, డిప్లమో - అనస్థీషియా, కార్డియాక్ కేర్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సులు. అర్హత : ఇంటర్. SC / ST / BC విద్యార్థులకు స్కాలర్‌షిప్పు / ఫ్రీ సీట్లు. సంప్ర : 76800 65835 [V- 2533]
■ రెగ్యులర్/డిస్టెన్స్/మధ్యలో చదువు ఆపేసిన/ ఫెయిల్ అయిన వారికి/ ఒకే సంవత్సరంలో పాస్ అయ్యే అవకాశం. 10th, 12th, Diploma, B.Tech, M.Tech, Degree, BCA, BBA, MBA, MCA, LLB, BEd, DEd, MLT, ANM, DMLT, ANESTHESIA, OT, MPHW. 86861 72989. [L-800616]

REAL ESTATE

RENT / SALE
■ భాజానగర్, గౌరీ టాకీస్ దగ్గర, నారాయణ కాలేజ్ ప్రక్కన, # 13-3-614లో గల 3 ఫ్లోర్స్ బిల్డింగ్ ఆఫీస్ / గోడౌన్ / కాలేజీలకు బాడుగకు లేదా అమ్మకానికి కలదు. 9912028216. [A-103]

NEW HOUSE FOR SALE
■ ATP, బళ్లారి రోడ్డు, MYR ఫంక్షన్ హాల్ ఎదురుగా, ప్రశాంతి కుటీర్ నందు 3 సెంట్లలో 2BHK న్యూ హౌస్, అన్ని వసతులతో అమ్మకానికి కలదు. (₹55L), సెల్ : 9177266885. [A-101]

ఇల్లు అమ్మబడును
■ 3వ పట్టణ పోలీసు స్టేషన్ దగ్గరలో ఉన్న శ్రీశ్రీ నగర్ ప్రక్కన ఉన్న రాజహంస వారిచే క్రొత్తగా నిర్మించిన గ్రాండ్ హోమ్స్ విల్లాస్ నందు హౌస్ నెం. 12 గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును. స్థలం : 3.34 సెంట్లు, కన్‌స్ట్రక్షన్ ఏరియా : 1350. సంప్ర : గౌతమ్, సెల్ : 8374262689 [A-1997]

SERVICES

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V- 6481]

WANTED
■ మా కంపెనీతో బిజినెస్ స్టార్ట్ చేయండి మంచి Income పొందండి. మండలాల వారీగా ఫీల్డ్ ఎంప్లాయిస్ కావలెను సంప్ర: 90009 77523. [A-1234]
■ SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు అడ్వయిజర్స్ నియామకాలు జరుగుచున్నవి. నెలకు ఆదాయం రూ. 25,000 + ఈ పైన, కనీసం 10th క్లాస్ పాస్ అయి, 25 సం॥ నిండి ఉండవలెను. ఫోన్ : 9849571330. [A-102]
■ పార్ట్ టైమ్ జాబ్ @ ATP TOWN. Timings : 8:30 am to 8:30 pm Lunch : ఫ్రీ SALARY : 9000/- per Month. Ph: 9705001972 [A- 784639]
■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. శాలరీ 15000 - 25000 వరకు కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217. [G-8878]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1233982]
■ సూపర్‌వైజర్స్/మేనేజర్స్ కావలెను. ధర్మవరం మునిసిపాలిటీ (Clap programme) నందు చెత్త సేకరణ ఆటోలను పర్యవేక్షణకు అనుభవం గల వారు కావలెను ✆ 8977937517, 9000274257 [B-755706]
■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నెల్లూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బద్వేల్, ఒంగోలుకు. 12 గం॥ డ్యూటీ. 45-50 సం. లోపు మగవారికి. 72880 04466, 72880 04477. [NA-11698]
■ Wanted Experienced Female Staff for Primary Classes (I to V) all subjects, Nursery, LKG & UKG Staff, Lucida Hand writing Staff, Dance & Yoga Staff & Admin Staff, to work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676. [C-800232]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

మండలానికి చేరిన విత్తన వేరుశనగ


వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న ఏఈఓ సుజిత

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు అవసరమైన సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు గురువారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. మండలంలోని ఆత్మకూరు, ముట్టాల, పంపనూరు గ్రామాలకు సంబంధించి 300 క్వింటాళ్ల వేరుశనగ సరఫరా అయినట్లు ఏఈఓ సుజిత తెలిపారు. వ్యవసాయ సిబ్బంది వేరుశనగ కాయలను పరిశీలించారు. వేరుశనగ కాయలు నాణ్యతగా ఉండటంతో బస్తాలను రైతు భరోసా కేంద్రాలు, గోదాముల్లో అన్‌లోడ్ చేయించారు.

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు మేలు


విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి గోవిందు

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, సృజనాత్మకతను పెంపొందించే డ్రాయింగ్, చెస్, యోగా వంటి వాటిపై శిక్షణ అందించారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు. పాఠకులతో పాటు విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఫలితాల అనంతరం ఆయా గ్రామాల్లోని నాయకులు, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం రాత్రి మండలంలోని మండలంలోని పులేటిపల్లి, వెంకటంపల్లి, ఓబుళంపల్లి, కనుముక్కల తదితర గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో రెచ్చగొట్టే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని నాయకులు, ప్రజలకు సూచించారు. రాజకీయంగా రెచ్చగొట్టేలా విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌తో క్షయ నివారణ


కనగానపల్లిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనకు బీసీజీ వ్యాక్సిన్ బాగా పనిచేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సోలమన్ తెలిపారు. మండలంలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. ముక్తాపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను డిప్యూటీ డీఎంహెచ్ఓ పర్యవేక్షించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. 60 ఏళ్లు పైబడిన వారితో పాటు, క్షయ వ్యాధి సోకిన ప్రతి ఒక్కరికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. కాగా మండల వ్యాప్తంగా 12 గ్రామ సచివాలయాల పరిధిలో 446 మందికి బీసీజీ వ్యాక్సినేషన్ చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, ధనమ్మ, సీహెచ్ఓలు, ఎంపీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ముక్తాపురంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సోలమన్

జీజీహెచ్‌లో మెరుగైన సేవలు


పసికందుకు 2 డీ ఎకో పరీక్ష చేస్తున్న దృశ్యం


అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో ఎక్స్‌రే తీస్తున్న దృశ్యం


జీజీహెచ్‌లో ఎంఆర్ఐ పరికరం

- రూ.వేల ఖర్చుతో కూడుకున్న సేవలు ఉచితం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందుతున్నాయి. ఆస్పత్రిలో ప్రసవ సమయంలో గర్భిణులు, అప్పుడే పుట్టిన పసికందులకు 2డీ ఎకో (గుండె పరీక్షలు) వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీంతో పాటు ఆర్థో, సర్జరీ విభాగాల శస్త్రచికిత్సలకు 2డీ ఎకో పరీక్ష ప్రామాణికంగా మారింది. సర్వజనాస్పత్రిలోని 2 డీ ఎకో పరీక్ష కేంద్రంలో సోమ, గురు, శనివారాల్లో 200 వరకు 2 డీ ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ లెక్క రోజూ 70 పరీక్షలు జరుగుతున్నాయి. వీటితో పాటు ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. రోజూ 30 నుంచి 40 ఎంఆర్ఐ, 30 సిటీ స్కాన్ సేవలందిస్తున్నారు. వీటితో పాటు అల్ట్రాసౌండ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర విభాగమైన అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్, చిన్నపిల్లల వార్డులో ఎక్స్‌రేలు తీయడానికి మొబైల్ ఎక్స్‌రే మిషన్లను ఏర్పాటు చేశారు. టెక్నీషియన్లు అక్కడికే వెళ్లి రోగులకు ఎక్స్‌రేలు తీస్తున్నారు. ప్రైవేట్‌గా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.1,000 నుంచి రూ.8 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి


ప్రజలకు సూచనలిస్తున్న సీఐ నరేంద్రరెడ్డి

ఆత్మకూరు: గ్రామాల్లో ప్రజలు ఎలాంటి అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. గురువారం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో మండలంలోని తలుపూరు గ్రామంలో పోలీసులు పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో ఏవైనా గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా మెలగాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మునీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

నేటి నుంచి యోగాసనా పోటీల శిక్షణ శిబిరం

అనంతపురం కల్చరల్: రాష్ట్రస్థాయి యోగాసనా పోటీల న్యాయనిర్ణేతల శిక్షణ శిబిరం ఈనెల 17 నుంచి 19 వరకు జరగనుంది. ఈ మేరకు వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని వేమన టెలిఫోన్ భవన్ వేదికగా యోగాసన భారత్ అనే జాతీయ స్థాయి సంస్థ నిర్దేశం ప్రకారం కోడ్ ఆఫ్ రూల్స్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన యోగా శిక్షకులు శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. మరన్ని వివరాలకు 9963028694 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యం



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చిగురు సిబ్బంది, పేపర్లతో తయారు చేసిన బొమ్మలను చూపుతున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యంగా టింబక్ట్ కలెక్టివ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చిగురు సెంటర్ ఇన్‌చార్జ్ అలివేలమ్మ తెలిపారు. న్యామద్దెల రోడ్డులోని గ్రంథాలయంలో ఆటపాటలు, బంకమట్టితో పలు రకాల బొమ్మల తయారీ, పెయింటింగ్, ఆర్గామి పేపర్ క్రాఫ్ట్, కులాజ్ వర్క్ తదితర వాటిపై గత పది రోజులుగా చిన్నారులకు ఇస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా చిగురు సెంటర్ ఇన్‌చార్జ్ అలివేలమ్మ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్నారులు సెల్ ఫోన్లకు త్వరగా ఆకర్షితులవుతున్నారన్నారు. వీటి నుంచి వారిని దూరం చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా శిక్షణ తరగతులకు హాజరయ్యారని తెలిపారు. వేసవి సెలవుల్లో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పోతలయ్య, సురేంద్రతో పాటు పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సేకరణ

- రోజూ 130 టన్నుల చెత్త తరలింపు
- ఇందుకోసం 73 వాహనాల వినియోగం
- పెట్రోల్‌కు రూ.6 లక్షల నుంచి రూ.6.5 లక్షల ఖర్చు

నగరపాలక సంస్థ	
డివిజన్లు	50
సచివాలయాలు	74
హౌస్ హోల్డ్స్	66,000
చెత్తను తరలించే వాహనాల సంఖ్య	73
అందులో క్లాప్ ఆటోలు	47
రోజూ కంపోస్టుకు తరలిస్తున్న చెత్త	130 టన్నులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో చెత్త సేకరణ పక్కాగా జరుగుతోంది. నగరంలోని అధికశాతం సచివాలయాల పరిధిలో క్లాప్ ఆటోల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. కొన్ని రోజుల పాటు క్లాప్ ఆటోల ద్వారా చెత్త సేకరణ ఆగిన విషయం విధితమే. ఇదే క్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్ చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరిగేందుకు చర్యలు తీసుకున్నారు.

73 వాహనాల ద్వారా చెత్త సేకరణ

నగరపాలక సంస్థ పరిధిలో 73 వాహనాలను చెత్త తరలింపుక వినియోగిస్తున్నారు. అందులో 47 క్లాప్ ఆటోలు ఉండగా.. 26 కంపాక్టర్లు, ట్రాక్టర్లు, అద్దె ట్రాక్టర్లు, పుష్‌కాట్లు, ఇతరత్రా వాహనాలు ఉన్నాయి. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 66 వేల హౌస్‌హోల్డ్స్‌లో రోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ జరుగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను కాంపాక్టర్ల ద్వారా కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. రోజూ 130 టన్నుల చెత్తను కంపోస్టుకు తరలిస్తున్నారు. ప్రస్తుతం క్లాప్ ఆటోల నిర్వహణ బాధ్యత నగరపాలక సంస్థ తీసుకుంది. 47 వాహనాల్లో ఒక్కో వాహనానికి రోజూ 20 నుంచి 23 లీటర్ల పెట్రోల్ సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. తద్వారా నగరపాలక సంస్థ ప్రతి నెలా రూ.6 లక్షల నుంచి రూ.6.5 లక్షల వరకు పెట్రోల్‌కు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు డ్రైవర్లకు ప్రతి నెలా వేతనం నగరపాలక సంస్థ చెల్లిస్తోంది.


నగరంలో క్లాప్ ఆటో ద్వారా చెత్తను సేకరిస్తున్న దృశ్యం

చెత్తను వాహనాల సిబ్బందికి అందించాలి



చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో చెత్తను క్లాప్ ఆటోలు, చెత్త తరలింపు వాహనాలకు అందించాలి. నగర పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. నగరాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి.

– వసీం, మేయర్

సారూ.. డ్రస్సింగ్ రూం చూపరూ


గైనిక్ వార్డులో ఓ అల్మారా కిటికీకి కర్టన్‌తో ఏర్పాటు చేసిన స్టాఫ్‌నర్సుల డ్రస్సింగ్ రూం

- జీజీహెచ్‌లో దయనీయమైన పరిస్థితి
- డ్రస్సింగ్ కోసం ఇబ్బందులు పడుతున్న స్టాఫ్‌నర్సులు
- గది ఖాళీగా ఉన్నా కేటాయించని గైనిక్ విభాగం అధికారులు


గైనిక్‌లో ఖాళీగా ఉన్న గదికి తాళాలు వేసిన దృశ్యం

అనంతపురం మెడికల్: కోవిడ్ విపత్కర సమయంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి స్టాఫ్‌నర్సులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ఇక్కడ రోగులకు వారందించిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం సైతం అవార్డును ప్రకటించింది. ఇటీవల జరిగిన ప్రపంచ నర్సుల దినోత్సవం రోజున స్టాఫ్‌నర్సుల అందించే సేవలు స్ఫూర్తిదాయకమని సాక్షాత్తు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, తదితరులు పొగడ్తలతో ముంచెత్తారు. కానీ అది మాటలకే పరిమితమైంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గైనిక్ విభాగంలో దయనీయమైన పరిస్థితి చోటు చేసుకుంది. ఇక్కడ మూడు వార్డులకు సంబంధించిన స్టాఫ్‌నర్సులకు డ్రస్సింగ్ రూం లేదు. గైనిక్ వార్డులో ఉండే ఓ అల్మారా, కిటికీకి తాడుకట్టుకుని అక్కడే డ్రస్సింగ్ చేసుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఈ విభాగంలో ఓ గది ఖాళీగా ఉన్నా.. గైనిక్ విభాగం వైద్యులు దాన్ని మూసి వేశారు. గతంలో ఆ గదిలో టీ స్టాల్ ఉండేది. దానిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో టీ స్టాల్‌ను తొలగించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న గదిని స్టాఫ్‌నర్సులకు ఇవ్వలేదు. ఇదే విషయమై ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతను సాక్షి ఆరా తీస్తే గతంలోనే గదిని కేటాయించాలని గైనిక్ విభాగానికి చెప్పినా.. వారి నుంచి ఎటువంటి స్పందన లేదని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని స్టాఫ్‌నర్సులకు గదిని కేటాయిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి


జేఎన్‌టీయూ స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న డీఎస్పీలు

అనంతపురం: జేఎన్‌టీయూ స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజా అధికారులను ఆదేశించారు. వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్పతో కలిసి గురువారం స్ట్రాంగ్ రూంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్ట్రాంగ్ రూంల పరిసరాల్లో ఫుట్ పెట్రోలింగ్, వజ్ర వాహనం ద్వారా గస్తీ కొనసాగిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ ముగిసే వరకు పటిష్ట మైన భద్రత కొనసాగించాలని ఆదేశించారు.

ఆరోగ్య సూచనలు పాటించాలి


జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


కనగానపల్లి: శివపురంలో ర్యాలీ చేపట్టిన ఆరోగ్య సిబ్బంది

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ప్రజలకు పలు ఆరోగ్య సూచనలను తెలియజేశారు. ఏడీఎస్ దోమలతో డెంగీ వ్యాప్తి చెందుతుందన్నారు. ఇది ముఖ్యంగా మంచి నీటిలో గుడ్లను వేస్తుందని తెలిపారు. వర్షాకాలంలో ఎక్కువగా నీరు నిల్వ ఉన్న చోట నిల్వ ఉంటాయని తెలిపారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఎర్ర దద్దుర్లు రావడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: దోమల ద్వారా వ్యాపించే డెంగీని నివారించుకోవాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు రాకుండా ఉండాలంటే దోమలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, ధనమ్మ, పలువురు ఏఎన్ఎంలు, హెల్త్‌అసిస్టెంట్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మిశ్రమ బియ్యం సేకరణకు వేలం


వేలం నిర్వహిస్తున్న ఈఓ రాణి

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం సేకరణకు గురువారం వేలం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో నలుగురు పాల్గొన్నారు. భక్తులు సమర్పించిన 1,500 కిలోల బియ్యం సేకరణకు తొండపాటు గ్రామానికి చెందిన రాజేష్ రూ.24,500కు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే వీరేపల్లి గ్రామ శివారులో ఉన్న మాన్యం భూముల సాగుకు వేలం నిర్వహించగా రూ.14,500 చెల్లించేలా అదే గ్రామానికి చెందిన రైతు హనుమేష్ పాట దక్కించుకున్నట్లు ఈఓ రాణి తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు.

వీణా వినోదిని అలంకారంలో వాసవీమాత



తాడిపత్రి అర్బన్: జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం కన్యకాపరమేశ్వరీదేవి వీణా వినోదిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. వైశాఖ శుద్ధ అష్టమి రోజు కావడంతో ఆర్యవైశ్యులు తమ ఇష్టదైవమైన వాసవి మాతకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం ఉదయం 10 గంటలకు వాసవీదేవికి లక్ష పుష్పార్చన కార్యక్రమం చేపట్టారు. వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళారతి నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు వాసవీమాత వీణావినోదిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులైయ్యారు.

నేడు పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో పోతులూరి వీరబ్రహ్మం ఆలయంలో శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవ నిర్వహించడం అనవాయితీ అన్నారు.అందులో భాగంగా శుక్రవారం పతాక ఆవిష్కరణ, గణపతి పూజ, నవ గ్రహాల పూజ, అభిషేకం, శనివారం ఉదయం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర గురువారం తెలిపారు. ఈ ఏడాది నుంచి బీకేఎస్ హైస్కూల్‌లో బాల, బాలికలకు ఇంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. వీటిలో ఎంపీసీ 40 సీట్లు, సీఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న షిరిడీ సాయి బాబా ఆలయ 31వ వార్షిక వేడుకలు గురువారం ముగిశాయి. షిరిడీసాయి భక్త మండలి సభ్యులు, సేవా సమితి సభ్యులు సంయుక్తంగా మంగళవారం వేడుకలు ప్రారంభించారు. మూడో రోజు అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, సంధ్యా హారతి వంటి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జీకె రాము, సత్యనారాయణ రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న నర్సరీలో బుధవారం రాత్రి అభిషేక్ అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. వివరాలు.. గుత్తికి చెందిన అభిషేక్ నర్సరీలో ఫ్యాన్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724,
9010223702, 9010567770, 9010588846, 9912220727